క్లుప్తంగా

అప్పన్నకు విశేషంగా తిరువీధి



స్వామివారి తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి తిరువీధిని విశేషంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను పల్లకిలో అధిష్ఠింపజేశారు. సింహగిరి మాడ వీధుల్లో తిరువీధిని వైభవంగా నిర్వహించారు. విశేషంగా హారతులు అందించారు. ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వెంకన్న సన్నిధిలో శ్రీనివాస హవనం



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పెందుర్తి: స్థానిక వేంకటాద్రిపై ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. స్వామివారి జన్మ నక్షత్రం(శ్రావణ) పురస్కరించుకుని శ్రీనివాస హవనంశాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా వెంకన్నకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

తల్లి చెంతకు బాలుడు



సింహాచలం రైల్వే స్టేషన్‌లో బాలుడిని తల్లికి అప్పగిస్తున్న ఆర్‌పీఎఫ్ పోలీసులు

గోపాలపట్నం: సింహాచలం రైల్వేస్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫారంపై అనుమానాస్పదంగా తిరుగుతున్న బాలుడు సూరాడ లతీష్‌ను ఆర్‌పీఎఫ్ పోలీసులు తల్లి చెంతకు చేర్చారు. ఆర్‌పీఎఫ్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో ప్లాట్‌ఫారంపై స్కూల్ బ్యాగ్‌తో కనిపించిన బాలుడిని పోలీసులు ప్రశ్నించారు. ట్రిప్ టికెట్ లేక పోవడంతో అనుమానం వచ్చి వివరాలు అడగ్గా సరైన సమాధానం చెప్పలేదు. దీంతో తల్లి దండ్రుల ఫోన్‌నంబర్లు అడిగి తెలుసుకున్నారు. తల్లి కృష్ణవేణికి సమాచారమందించారు. వీరు పెందుర్తి మండలం సుజాతానగర్‌లో నివాసముంటున్నారు. చదవడం ఇష్టం లేపోవడంతో ఇంటి నుంచి వచ్చేశాడని చెబుతున్నారు. సింహాచలం రైల్వే స్టేషన్‌లో తల్లి కృష్ణ వేణికి స్టాఫ్ కె. అనిత, ఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ కె. ఎస్.రావు బాలుడిని అప్పగించారు. దీంతో ఆమె పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది.

ఏపీ వ్యవసాయ సేవా సంఘం ఉమ్మడి విశాఖ కార్యవర్గం



ఎన్నిక ఉత్తర్వు అందుకుంటున్న నూతన పాలకవర్గ సభ్యులు

సబ్బవరం: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ సేవా సంఘం ఉమ్మడి విశాఖ జిల్లా ఎన్నికలు విశాఖలోని జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో సీనియర్ సహాయకునిగా పనిచేస్తున్న ఎస్.క్రాంతికుమార్‌ను అధ్యక్షుడిగా, ఎల్.మోహన్‌రావును కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఎస్.వెంకటేశ్వర రావు, సహాయ ఎన్నికల అధికారిగా వెన్న రమేష్, ఎన్నికల పరిశీలకునిగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.పాపారావు వ్యవహరించారు. ఎన్నికైన పాలకవర్గ సభ్యులకు ఉత్తర్వులు అందించారు. నూతన అధ్యక్ష, కార్యదర్శుల తోపాటు మిగిలిన పాలకవర్గ సభ్యులను ఉమ్మడి వ్యవసాయ శాఖ సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షుడు పీవీ సాయికుమార్, ప్రధాన కార్యదర్శి ఎ.రవికుమార్, కార్యదర్శి వి.కొండబాబు పాల్గొన్నారు.

వీధి కుక్కలు భౌబోయ్!

- గ్రామాల్లో విచ్చలవిడిగా సంచారం
- పెరుగుతున్న కుక్కకాటు బాధితులు
- వీధి కుక్కల నియంత్రణలో అధికారుల వైఫల్యం

వీధి కుక్కలతో పల్లె ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పరవాడ మండలంలోని 15 గ్రామ పంచాయతీల పరిధిలో ఏ వీధికెళ్లినా వీధి కుక్కలు పదుల సంఖ్యలో కనిపిస్తూనే ఉంటాయి. రహదారులు, మాంసం, చేపల దుకాణాల వద్ద వీటి సంచారం ఎక్కువ. దీంతో ప్రయాణికులు, వాహనదారులు, విద్యార్థులు, పిల్లలు, మహిళలు రోడ్ల మీదకు రావాలంటే భయపడుతున్నారు.



కుక్కకాటుకు మరణించిన విద్యార్థి శ్యామల(ఫైల్)

పరవాడ: మండలంలో కుక్కకాటు బాధితులు పెరుగుతున్నారు. ఇటీవల పరవాడ, ఈ.బోనంగి, పి.బోనంగి, వెన్నలపాలెం గ్రామాల్లో పంచాయతీ అధికారులు వీధి కుక్కల నియంత్రణ కార్యక్రమం చేపట్టినప్పటికీ ఫలితం కనిపించలేదు. మాంసం, చేపల దుకాణాలు, కోళ్ల ఫారాలు ఉన్న ప్రదేశాల్లో వీధి కుక్కలు మకాం వేసి తమ సంతతిని పెంచుకుంటున్నాయి. గ్రామీణ ప్రాంత ప్రజలపై వీధి కుక్కల దాడులు రోజు రోజుకి పెరిగిపోతున్నాయి. దాడుల్లో గాయపడినవారు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరి చికిత్స పొందుతున్నారు. కొంత మంది నాటు వైద్యంపై ఆధారపడి ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు.

కుక్కకాటుపై నిర్లక్ష్యం వద్దు

కుక్కే కదా కరిచింది.. తినే ఆహారంలో పత్యం పాటిస్తే సరిపోతుందిలే అనుకుంటే ప్రాణాలే పోగొట్టుకునే ప్రమాదం ఉంది. ఇలాంటి నిర్లక్ష్యం వల్లే నాయుడుపాలెం శివారు మెట్టపాలెం గ్రామానికి చెందిన బండి శ్యామల అనే పదో తరగతి విద్యార్థి ఇటీవల మృత్యువాత పడింది. ప్రయాణికులు, విద్యార్థులు, వాహనదారులపై వీధి కుక్కల దాడులు ఈ మధ్య కాలంలో అధికమయ్యాయి. వీధుల్లో సంచరిస్తున్న కుక్కల కారణంగా



పరవాడ-భర్నికం రహదారిలో గుంపుగా సంచరిస్తున్న వీధి కుక్కలు

గ్రామీణ ప్రజలు రోడ్లపైకి రావాలంటే భయపడుతున్నారు. రాత్రి సమయంలో వీధుల్లో సంచరిస్తూ అరుపులతో ప్రజలకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి.

పాడి పశువులపై దాడులు

గ్రామీణ ప్రాంతాల్లో రైతులు పెంచుకొంటున్న గొర్రెలు, మేకలు, పశువులు, కోళ్లపై కుక్కల దాడులు పెరుగుతున్నాయి. కుక్క కాటుకు గురైన పశువులు మరణిస్తున్నాయి. పశువుల్ని మేతకు వదిలినప్పుడు ఇవి దాడి చేస్తున్నాయి. కొన్నిసార్లు పశువుల గాయాలకు కుక్క కాటే కారణమని తెలియక, వైద్యం అందించక పోవడంతో మృత్యువాత పడుతున్నాయి. మత్స్యకార గ్రామాలైన ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెంలో వీటి బెడద మరీ ఎక్కువ. మత్స్యకారులు తీరంలో వదిలిపెడుతున్న చేపల వ్యర్థాలకు అలవాటు పడి బీచ్‌లో మకాం వేస్తున్నాయి. సముద్ర సందర్శనకు వచ్చే పర్యాటకులపై దాడులకు పాల్పడుతున్నాయి.

రేబీస్ వ్యాధి లక్షణాలు

- జ్వరం, వాంతులు, విరేచనాలు, తలనొప్పి, గొంతు నొప్పి వస్తుంది.
- ఫిట్స్, కాళ్లు చేతులు పడిపోవడం(పక్షవాతం), కోమా, పిచ్చి పిచ్చిగా మాట్లాడటం వంటి లక్షణాలు తలెత్తుతాయి.
- క్యాన్సర్, మధుమేహం వ్యాధి గ్రస్తులు 28వ రోజునా వ్యాక్సిన్ డోస్ తీసుకోవాల్సి ఉంటుంది.

రెండు పీహెచ్‌సీల పరిధిలో కుక్కకాటు బాధితులు

నెల	పరవాడ	వాడచీపురుపల్లి
మే	44	20
జూన్	43	21
జూలై	39	18
ఆగస్టు	28	19
సెప్టెంబర్ (14 వరకు)	21	15
మొత్తం	175	93

వ్యాక్సిన్ నిల్వలు

పీహెచ్‌సీ	ఏఆర్‌వీ	ఏఎస్‌వీ	పాముకాటు
పరవాడ	31	14	00
వాడచీపురుపల్లి	95	00	35

కుక్క కాటు వేస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- కుక్క కరిచిన వెంటనే సబ్బుతో గాయాన్ని శుభ్రం చేసి, దగ్గర్లో ఉన్న ఆస్పత్రిని సంప్రదించాలి.
- యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించుకోవాలి.
- గాయానికి ఎప్పటికప్పుడు డ్రెసింగ్ చేయించాలి.
- ఏఆర్‌వీ వ్యాక్సిన్‌ను 0, 3, 7, 14 రోజుల చొప్పున తీసుకోవాలి.
- కుక్క కాటుకు ఆహార నియమాలేవీ లేవు.
- కరచిన కుక్కను 10 రోజుల పాటు గమనించాల్సి ఉంటుంది.
- కుక్క ఆరోగ్యంగా ఉంటే గాయపడిన వారు భయపడనక్కర్లేదు.

పశువులను చంపేస్తున్నాయి



రోడ్లపై విచ్చల విడిగా సంచరిస్తున్న వీధి కుక్కలతో ఇబ్బంది పడుతున్నాం. వేలాది రూపాయలతో కొనుగోలు చేసి పెంచుకుంటున్న గొర్రెలు, మేకలు, పశువులు, కోళ్లపై దాడులు చేస్తున్నాయి. వెంట పడి చంపేస్తుండటంతో తీవ్రంగా నష్టపోతున్నాం. వీధి కుక్కలకు భయపడి పశువులకు రాత్రి వేళ కాపలా ఉండాల్సి వస్తుంది. వీధి కుక్కల బెడదను అరికట్టాలి.

– పోతల శంకర్రావు, రైతు, పరవాడ

రోడ్లపై తిరగనివ్వట్లేదు



గ్రామంలో వీధి కుక్కల సంచారం అధికంగా ఉంది. వీధి కుక్కలు ఎక్కడపడితే అక్కడ సంచరిస్తున్నాయి. రోడ్లపై మకాం వేసి పాదచారులు, వాహనచోదకులపై దాడులు చేస్తున్నాయి. రాత్రుళ్లు రోడ్లపై తిరగాలంటే పిల్లలు, మహిళలు భయపడుతున్నారు. రాత్రి వేళ కుక్కల అరుపులతో నిద్రపోలేకపోతున్నాం. వీలైనంత వేగంగా వీధి కుక్కల నియంత్రణ చర్యలు చేపట్టాలి.

– శ్రీనివాస్, హనుమాన్‌కాలనీ, వెన్నలపాలెం

వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి



ప్రభుత్వ ఆస్పత్రిలో కుక్క కాటుకు అవసరమైన యాంటీ రేబిస్ వ్యాక్సిన్(ఏఆర్‌వీ)లు అందుబాటులో ఉన్నాయి. పాము కాటు వ్యాక్సిన్లు కూడా నిల్వ ఉన్నాయి. కుక్క కాటుతో గాయపడి రోజూ ఒకరిద్దరు ఆస్పత్రికి వస్తున్నారు. చికిత్స అందించి పంపుతున్నాం. తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నాం. పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు వేయించాలి.

– క్రాంతి కుమార్, ప్రభుత్వ వైద్యాధికారి, వాడచీపురుపల్లి

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు



ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వీధి కుక్కల నియంత్రణ కార్యక్రమాన్ని వాయిదా వేశాం. పరవాడ, వెన్నలపాలెం, పి.బోనంగి, ఈ.బోనంగి గ్రామాల్లో ఇటీవల 120 కుక్కలను పట్టి కొమ్మాది వెటర్నరీ ఆస్పత్రికి తరలించాం. అక్కడ కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయిస్తున్నాం. మరో వారం రోజుల్లో మళ్లీ కుక్కల నియంత్రణ చర్యలను ప్రారంభిస్తాం.

– రమేష్‌కుమార్, ఈవోఆర్డీ, పరవాడ

జాతీయస్థాయి యోగా పోటీలకు గురుకుల విద్యార్థులు



యోగా పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులతో శిక్షకుడు ఆంజనేయులు

పరవాడ: ఆంధ్రప్రదేశ్ యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఈ నెల 14, 15 తేదీల్లో భీమిలిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో తానాం గురుకుల పాఠశాలకు చెందిన బి.వైష్ణవి 12–14 సంవత్సరాల విభాగంలో బంగారు పతకం, ఎస్.కౌశిక కాంస్య పతకం సాధించారు. 14–16 ఏళ్ల విభాగంలో కె.వెంకట వైష్ణవి వెండి పతకం సాధించగా, కె.భావన కాంస్యం దక్కించుకుంది. వీరు అక్టోబర్‌లో హిమాచల్‌ప్రదేశ్‌లో జరగనున్న జాతీయ స్థాయి యోగా పోటీలకు అర్హత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.అప్పలనాయుడు, యోగా శిక్షకుడు సీహెచ్ ఆంజనేయులు ఆదివారం మీడియాకు తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది.

మొల్లోడి గెడ్డలో రసాయన వ్యర్థాలతో దుర్వాసన



రసాయన వ్యర్థ జలాల గురించి చెప్తున్న గనిశెట్టి

పరవాడ: మండలంలో పరవాడ-భర్నికం గ్రామాల మధ్య మొల్లోడి గెడ్డలో భారీ ఎత్తున నిలిచిన రసాయన వ్యర్థ జలాలను తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. గెడ్డ ప్రాంతాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. జేఎన్ ఫార్మా పరిశ్రమలు యథేచ్ఛగా విడుదల చేస్తున్న రసాయన వ్యర్థాలు మొల్లోడి గెడ్డలోకి చేరి, భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని ఆరోపించారు. రసాయన వ్యర్థాలను జలాల్లోకి విడిచిపెడుతున్న పరిశ్రమలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మొల్లోడి గెడ్డలో చేరుతున్న రసాయన వ్యర్థాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో తూతూ మంత్రంగా తొలగింపు ప్రక్రియ చేపట్టారని, మళ్లీ గెడ్డలో యథావిధిగా వ్యర్థాలు చేరి భరించలేని దుర్వాసన వస్తోందన్నారు.

ఘనంగా అన్నసమారాధనలు



పెందుర్తిలో గణనాథునికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

పెందుర్తి: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెందుర్తి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఆదివారం భారీ అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు. జీవీఎంసీ 96వ వార్డు పరిధిలోని పలు గణపతి మండపాలను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు సందర్శించి ప్రత్యేక పూజలు జరిపారు. అన్నసమారాధనలు ప్రారంభించారు.

- 96వ వార్డు పరిధిలోని రాచ్చెరువు, దొగ్గవానిపాలెం, పెందుర్తి పాతూరు, పెందుర్తి కూడలి, సాయి నగర్, ద్రోణంరాజునగర్, దుర్గానగర్ ప్రాంతాల్లోని గణపతి మండపాలను వైఎస్సార్‌సీపీ నేత, మాజీ కార్పొరేటర్ శరగడం చినఅప్పలనాయుడు సందర్శించి అన్నసమారాధనలు ప్రారంభించారు. ముందుగా గణపతికి ప్రత్యేక పూజలు చేశారు.
- 97వ వార్డు పరిధిలోని శ్రమశక్తినగర్, వాణిపాలెం, ఎస్సీ, బీసీ కాలనీ, సుజాతనగర్ ప్రాంతాల్లోని గణపతి మండపాలను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, కార్పొరేటర్ శానాపతి వసంత, శంకర్రావు దంపతులు సందర్శించి ప్రత్యేక పూజలు జరిపారు. అన్నసమారాధనలు చేశారు.
- మండలంలోని జుత్తాడలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఎన్‌సీఈఆర్‌టీ అడిషనల్ డైరెక్టర్ ప్రొఫెసర్ డి.కె.రెడ్డి, సౌజన్య దంపతుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దాదాపు 2 వేల మంది అన్నప్రసాదాలు స్వీకరించారు. ముందుగా గణపతి సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో



దొగ్గవానిపాలెంలో మాజీ కార్పొరేటర్ శరగడం చినఅప్పలనాయుడుని సత్కరిస్తున్న కమిటీ సభ్యులు



కాపువీధి అన్నసమారాధనలో వడ్డిస్తున్న కర్రి అప్పలస్వామి

వైఎస్సార్‌సీపీ నేత బొడ్డు సూర్యప్రకాష్, ఉత్తరాంధ్ర బీసీ సంఘం కన్వీనర్ రాజు, గౌడ యాత కమిటీ కన్వీనర్ గౌరీష్ తదితరులు పాల్గొన్నారు.

- కోట్నివానిపాలెంలో గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఊరేగింపు, నిమజ్జనోత్సవం ఘనంగా జరిగాయి.

పరవాడ: మండలంలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ముత్యాలమ్మపాలెం, నాయుడుపాలెం, చినతాడి గ్రామాల్లో గణనాథుడి నిమజ్జనోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముత్యాలమ్మపాలెంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్, పార్టీ నాయకులు బొంది అచ్చిబాబు, సూరదా మసేను దర్శించుకుని, పూజలు జరిపి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్నసమారాధనను రవికుమార్ ప్రారంభించారు.

- నాయుడుపాలెంలో చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గణపతికి ప్రత్యేక పూజలు జరిపారు. లడ్డూ వేలం నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కూండ్రపు అప్పలనాయుడు, కూండ్రపు శ్రీనివాసరావు, కె.నరసింహమూర్తి, నాని తదితరులు పాల్గొన్నారు.



పాపయ్యరాజుపాలెంలో గణపతిని దర్శించుకుంటున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు, గండి రవికుమార్



ముత్యాలమ్మపాలెంలో గణనాథుడిని దర్శించుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు గండి రవికుమార్



గణపతి లడ్డూ వేలంలో పాల్గొన్న గ్రామ పెద్దలు



చినతాడిలో అన్నసమారాధనను ప్రారంభించిన మాజీ ఎంపీపీ నీలబాబు

- చినతాడి గ్రామంలో బొజ్జగణపయ్య వేడుకల్లో భాగంగా మాజీ ఎంపీపీ మాధంశెట్టి నీలబాబు దంపతులు వినాయకుడిని దర్శించుకుని, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో కోమటి రాజు, కోమటి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం: 98వ వార్డు సింహపురికాలనీలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, కాలనీ యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయకచవితి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం మధ్యాహ్నం 2వేల మందికి అన్నసమారాధన జరిపారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పీతల విష్ణుమూర్తి, అడవివరం కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి కార్యక్రమాన్ని ప్రారంభించి, అన్నవడ్డన చేశారు. కాలనీ మహిళలు, నివాసితులు పెద్ద ఎత్తున తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రి సత్తిబాబు, నడింపల్లి రామరాజు, కాలనీ అధ్యక్షుడు కామేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు చిరంజీవిరావు, కోఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్లు ఆకుల నాగరాజు, పాలూరి సూరిబాబు, స్థానికులు తిమడాన స్వామి, గెద్ద వెంకటరమణ, కనకారావు కాలనీ నివాసితులు నాయుడు, యూత్ యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న దుర్గాదేవి మంచు విగ్రహం



మంచువిగ్రహాన్ని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: 98వ వార్డు పరిధి సింహపురికాలనీలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, కాలనీ యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయకచవితి మహోత్సవాల్లో ఆదివారం రాత్రి ఐస్‌తో తయారుచేసిన శివలింగం, దుర్గాదేవి విగ్రహాల చెంతన విశేషంగా దీపారాధన నిర్వహించారు. కాలనీ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పాల్గొని దీపాలు వెలిగించారు. కాలనీలో వినాయకచవితిని వైభవంగా నిర్వహిస్తుండటంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పీతల అప్పలరాజు, పీతల విష్ణుమూర్తి, నడింపల్లి రామరాజు, కె.సింహాద్రి, కాలనీ అసోసియేషన్ నాయకులు, నిర్వాహకుడు యశ్వంత్, యూత్ పాల్గొన్నారు.

వరి పంట నష్టంపై క్షేత్రస్థాయి పరిశీలన



తవ్వవానిపాలెంలో నష్టపోయిన వరి క్షేత్రాలను పరిశీలిస్తున్న సబ్ డివిజన్ ఏడీఏ రామారావు



బోదువలస రైతు సేవాకేంద్రంలో ఈకేవైసీ వివరాలను తెలుసుకుంటున్న ఏడీఏ రామారావు

సబ్బవరం: రైతులు సాగు చేస్తున్న ప్రతి పంటను ఈ పంట ద్వారా నమోదు చేయాలని అనకాపల్లి వ్యవసాయ సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.రామారావు గ్రామ వ్యవసాయ సహాయకులకు సూచించారు. మండలంలోని సబ్బవరం ,తవ్వవానిపాలెం గ్రామాల్లో ఇటీవల భారీ వర్షాలకు వరి పంటకు జరిగిన నష్టం అంచనాకు ఆదివారం క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. సస్య రక్షణపై రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం బోదువలస, మల్లునాయుడుపాలెం గ్రామాలలో ఈ క్రాప్ చేసుకున్న రైతులకు ఈకేవైసీ జరుగుతున్న తీరును పరిశీలించారు. త్వరితగతిన ఈకేవైసీ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పంట ద్వారా నమోదైన రైతుల జాబితాలతో పాటు పంట నష్టం వివరాలను గ్రామ సచివాలయం, రైతు సేవా కేంద్రాల్లో సామాజిక తనిఖీల కొరకు ప్రదర్శించాలని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే మార్పులు చేసి జాబితాలను పంపించాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 23తో ఈ పంట, ఈ క్రాప్ నమోదు పూర్తి చేయాలన్నారు. 25 నుంచి 27 వరకు ఈ పంట జాబితాలను గ్రామ సభలలో చదివి, సామాజిక తనిఖీల కొరకు జాబితాలను ప్రదర్శించాలన్నారు. గ్రామ సభలలో ప్రదర్శించిన తుది జాబితాలను ఈ నెల 30న రైతు భరోసా కేంద్రాలలో ప్రదర్శించాలని ఆదేశించామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ, గ్రామ వ్యవసాయ సహాయకులు బొబ్బరి లావణ్య, శ్రీనివాస్, పి.హేమలతతో పాటు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

642 మందికి ఉచిత వైద్య పరీక్షలు

నరిపల్లిలో మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పెందుర్తి: గీతం మెడికల్ కళాశాల/ఆస్పత్రి, ఇండియా యూత్ ఫర్ సొసైటీ, నియోలయా సెంటర్ ఫర్ గ్లోబల్ హెల్త్ రీసెర్చ్ సంయుక్త ఆధ్వర్యంలో పెందుర్తి మండలం సరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం జరిగిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మొత్తం అన్ని విభాగాల్లో 642 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, డెర్మటాలజీ, కంటి పరీక్షలు, ఈఎన్‌టీ, పీడియాట్రిక్, గైనకాలజీ, డెంటల్ విభాగాల్లో ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. మందులతో నయమయ్యే వారికి అవసరమైన మందులు అందించారు. మెరుగైన వైద్యం, శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి గీతం మెడికల్ కళాశాలలో ఉచితంగా నిర్వహించేందుకు రిఫర్ చేశారు. గీతం డెంటల్ కళాశాల హెచ్‌వోడీ డాక్టర్ నాగప్రియ, ప్రొఫెసర్ సంతోష్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు మనోప్రభ, కృష్ణ చైతన్య, చిత్ర, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.